క్లుప్తంగా

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

కంటోన్మెంట్: విద్యుత్ ఫీడర్ల మరమ్మతులు, చెట్ల కొమ్మల తొలగింపు కారణంగా సరఫరాలో అంతరాయం ఉంటుందని సంబంధిత అధికారులు పేర్కొన్నారు. భూదేవీ నగర్ ఫీడర్ పరిధిలోని గొల్లగూడ ప్రాంతంలో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు, యాదమ్మనగర్ ప్రాంతంలో మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 వరకు విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు.

కుందన్‌బాగ్, ఎయిర్‌పోర్ట్, హెచ్‌పీఎస్ పరిధిలో..

సనత్‌నగర్: కుందన్‌బాగ్, ఎయిర్‌పోర్ట్, హెచ్‌పీఎస్ సబ్‌స్టేషన్ల పరిధిలోని విద్యుత్ ఫీడర్ లైన్ల మరమ్మతుల కారణంగా సరఫరాలో అంతరాయం ఉంటుందని గ్రీన్‌ల్యాండ్స్ ఏడీఈ కిషోర్‌కుమార్ తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఐఏఎస్ క్వార్టర్స్, ఐపీఎస్ క్వార్టర్స్, మినిస్టర్ క్వార్టర్స్, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఇంటర్‌గ్రాఫ్, తాజ్‌వివంతా ప్రాంతాల్లో విద్యుత్ ఉండదన్నారు.

నేడు, రేపు ఆధ్యాత్మిక ప్రవచనాల బోధన

ఉస్మానియా యూనివర్సిటీ: స్వామి వివేకానంద పరివ్రాజక్ ఆధ్వర్యంలో నేడు, రేపు సరళ ఆధ్యాత్మిక ప్రవచనముల కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఓయూ అధ్యాపకులు డాక్టర్ ధర్మతేజ తెలిపారు. ఓయూ క్యాంపస్ ఎన్‌సీసీ గేటువద్దనున్న సంస్కృత సురభారతిలో నేడు ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం 8 గంటల వరకు, రేపు కూడా అదే సమయానికి ఉప్పల్‌లోని ఈస్ట్ కళ్యాణ్‌పూరి కమ్యూనిటీ హాల్లో ప్రవచనాలు చేయనున్నట్లు వివరించారు. సుల్తాన్ బజార్ ఆర్యసమాజ్‌మందిర్‌లో 10, 11, 12 తేదీల్లో ఉదయం 8.30 నుంచి 9.30 నిమిషాల వరకు ప్రవచనాల పఠనం ఉంటుందన్నారు.

ఫిస్ట్‌బాల్ జాతీయ జట్టుకు వేదాంత వర్ధిని విద్యార్థులు

కంటోన్మెంట్: తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహణ సాగే బోయిన్‌పల్లిలోని వేంకటేశ్వర వేదాంత వర్ధిని సంస్కృత కళాశాల, పాఠశాల విద్యార్థులు జశ్వంత్, నరేశ్ జాతీయ ఫిస్ట్‌బాల్ జట్టుకు ఎంపికయ్యారు. ఈ నేపథ్యంలో కళాశాల ప్రధానాచార్యులు డాక్టర్ బానోత్ సురేందర్, ప్రిన్సిపాల్ కిషన్ విద్యార్థులను అభినందించి మాట్లాడా రు. ఫిస్ట్‌బాల్ పోటీల్లో తమ విద్యార్థులు జాతీయ జట్టుకు ఎంపిక కావడం సంతోషకరం అన్నారు. సంస్కృత బోధనతో పాటు విద్యార్థులకు క్రీడల్లో తగిన ప్రోత్సాహం అందిస్తున్నామని అన్నారు.

ఉదయ్‌కిరణ్‌కు డాక్టరేట్

రసూల్‌పురా: కంటోన్మెంట్ బొల్లారం రిసాలబజార్ నివాసి కొంతం ఉదయ్‌కిరణ్‌కు ఉస్మానియా యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్‌లో పీహెచ్‌డీ డాక్టరేట్ లభించింది. మెకానికల్ ఇంజినీరింగ్‌లో పారమెట్రిక్ ఆప్టిమైజేషన్ ఆఫ్ టాపర్ కట్టింగ్ ప్రాసెస్ ఆన్ డీ-2 స్టీల్ వైర్ ఈడీఎంలో పీహెచ్‌డీ డాక్టరేట్ లభించింది. ఈ సందర్భంగా కంటోన్మెంట్ ఎమ్మెల్యే జి. సాయన్న, మల్కాజిగిరి ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు ఉదయ్‌కిరణ్‌ను అభినందించారు.

చీరల పంపిణీ



సికింద్రాబాద్: మెట్టుగూడ, తార్నాక డివిజన్లలోని పేద మహిళలకు సోమవారం మాజీ కార్పొరేటర్ ర్యాల అడవయ్య చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో చీరలు పంపిణీ చేశారు. అడవయ్య 8వ వర్ధంతి సందర్భంగా ట్రస్టు నిర్వాహకులు ర్యాల రాజేందర్, మహేందర్‌యాదవ్, ప్రతినిధులు బాలమణి, సురేఖ, నర్సింగ్, శ్రీనివాస్, మురళి చీరలు అందజేశారు.

కార్మికుల సంక్షేమానికి కృషి

సికింద్రాబాద్: దక్షిణ మధ్యరైల్వే ఎంప్లాయీస్ సంఘ్ సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ బ్రాంచ్ సహాయ కార్యదర్శి ధన్‌రాజ్‌తోపాటు అయన అనుచరులు సోమవారం మజ్దూర్ యూనియన్‌లో చేరారు. యూనియన్ జాతీయ ప్రధాన కార్యదర్శి సీహెచ్.శంకర్‌రావు వారిని తమ యూనియన్‌లో చేర్చుకుని సభ్యత్వం ఇచ్చారు. ఈ సందర్భంగా శంకర్‌రావు మాట్లాడుతూ.. కార్మికుల సమస్యల పరిష్కారం, సంక్షేమం కోసం నిరంతరం తమ యూనియన్ పని చేస్తున్న ఫలితంగా పలు యూనియన్ల నుంచి కార్మికులు, నాయకులు మజ్దూర్ యూనియన్‌లో చేరుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో సత్యనారాయణ, చిలుక స్వామి, తిరుపతి రావు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

సన్మానం

లాలాపేట: తార్నాక, లాలాపేట ప్రాంతానికి చెందిన పలువురు ఆటో డ్రైవర్ల బృందం సోమవారం ఓయూలోని నల్లకుంట ట్రాఫిక్ పోలీసు స్టేషన్‌లో నల్లకుంట ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ రామకృష్ణ, ఇతర పోలీసు అధికారులను మర్యాదపూర్వకంగా కలిసి వారిని శాలువాతో సత్కరించి నూతన సంవత్సరం, సంక్రాంతి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. పొట్టకూటి కోసం ఆటో నడుపుకుంటూ జీవనం సాగిస్తున్న ఆటో డ్రైవర్ల పట్ల ట్రాఫిక్ పోలీసులు మానవతా దృక్పథంతో వ్యవహరించాలన్నారు. కృష్ణమూర్తి, శ్రీనివాస్, సత్యనారాయణ పాల్గొన్నారు.

సంక్రాంతి సంబురాలు...
అలరించిన నృత్యాలు



కొత్త కుండలో వంటకం చేస్తున్న దృశ్యం



చిన్నారుల సంప్రదాయ నృత్యాలు

సనత్‌నగర్: హిందూ పబ్లిక్ స్కూల్‌లో సోమవారం సంక్రాంతి సంబరాలు అంబరాన్నంటాయి. హరిదాసుల కోలాహలం, భోగి మంటల భగభగలు అందమైన రంగవల్లుల నడుమ గొబ్బెమ్మలు పసి మోముల శిరోజాల నుంచి జాలువారే భోగిపండ్లు.. బొమ్మల కొలువు ఇలా సంక్రాంతి పండుగ విశిష్టత, సంప్రదాయాలను చిన్నారులు ఆవిష్కరించారు. పల్లె వాతావరణం తలపించేలా అచ్చమైన తెలుగు సంస్కృతికి జీవం పోశారు. సంక్రాంతి వేళ పల్లెల్లో కనిపించే హరిదాసుల నుంచి ఆడపడుచుల హంగామా వరకు కళ్లకు కట్టినట్లు చూపించారు. ఈ వేడుకలకు కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి సతీమణి కావ్యారెడ్డి, వివేకానంద ఎడ్యుకేషనల్ సేవా సమితి చైర్మన్ బూర్గుల శ్యాంసుందర్‌గౌడ్ హాజరై మాట్లాడారు. తెలుగు వారి పండుగలు మన సంస్కృతి సంప్రదాయాలకు నిలువెత్తు సాక్ష్యంగా నిలుస్తాయన్నారు. వారిని చిన్నతనం నుంచే పిల్లలకు తెలియపరిచి మక్కువ పెంచాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. సంప్రదాయ పరికిణీల్లో చిన్నారులు చేసిన నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో కంజర్ల చంద్రకళాయాదవ్, హెచ్ఎస్ త్రిపాఠి, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.



చిన్నారులకు భోగి పండ్లు పోస్తున్న కావ్యారెడ్డి



పాఠశాల ఆవరణలో ఏర్పాటుచేసిన బొమ్మల కొలువు

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

అడ్డగుట్ట: అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందజేస్తున్నామని డిప్యూటీ స్పీకర్ పద్మారావుగౌడ్ అన్నారు. సోమవారం ఆయన కార్పొరేటర్ ప్రసన్న లక్ష్మితో కలిసి నార్త్‌లాలాగూడ, శేషాపహాడ్, శాంతి నగర్, తుకారాంగేట్, గడ్డమీదిబస్తీ, సాయినగర్, వడ్డెరబస్తీ, మాంగ్‌గరోడి బస్తీ, ఆజాద్ చంద్రశేఖర్ నగర్‌లో ఇంటింటికి వెళ్లి కల్యాణలక్ష్మి, షాదీముబారక్, సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రవేశపెట్టిన వివిధ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆడపిల్లల పెళ్లిళ్లు భారంగా భావించకుండా ప్రభుత్వం కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పేరిట ఆసరా కల్పిస్తోందన్నారు. అనంతరం చంద్రశేఖర్ నగర్‌ర్‌లో బీఆర్ఎస్ జెండాను ఆవిష్కరించి బస్తీలో రూ. 8.50 లక్షలతో చేపట్టనున్న సీవరేజీ పైప్‌లైన్ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో జలమండలి జీఎం రమణారెడ్డి, డీజీఎం కృష్ణ, ఏఈ స్రవంతి, డిప్యూటీ ఎమ్మార్వో శివకుమార్, నేతలు లింగాని శ్రీను, నక్క మధు, శ్రీనివాస్‌గౌడ్, మనోహర్, సత్తయ్య, అమర్, రాజు, గీతాదయాకర్, ప్రవీణ్, మహ్మద్ పాల్గొన్నారు.



చెక్కు అందజేస్తున్న పద్మారావుగౌడ్

విద్యార్థులను క్రీడల్లో ప్రోత్సహిస్తాం



క్రీడా పరికరాలు అందజేస్తున్న జంపన ప్రతాప్, ప్రకాష్ బాంటియా

రసూల్‌పురా: ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు వివిధ క్రీడల్లో ప్రోత్సహించడానికి అందించేందుకు కృషి చేస్తున్నామని కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షులు జంపన ప్రతాప్ అన్నారు. సోమవారం తిరుమలగిరి మండలం కార్ఖానా ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల్లో షటిల్, బాస్కెట్‌బాల్, వాలీబాల్ క్రీడా మైదానాల ప్రారంభోత్సవానికి ఆయన హ్యూమన్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు ప్రకాష్ బాంటియాతో కలిసి హాజరయ్యారు. అనంతరం ప్రకాష్ బాంటియా విద్యార్థులకు క్రీడా పరికరాలు అందజేశారు. అనంతరం పాఠశాల హెచ్ఎం మంజుల స్వర్ణ మాట్లాడుతూ.. పాఠశాల్లో సమస్యలను జంపన ప్రతాప్ దృష్టికి తీసుకెళ్లగానే స్పందించి పాఠశాల్లో క్రీడా మైదానాలు అభివృద్ధి చేశారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ప్రసాద్, సురేందర్ రెడ్డి, షఫ్రక్, పద్మావతి, శ్రీదేవి, మడ్‌ఫోర్ట్ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఆశీర్వాదం పాల్గొన్నారు.

తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం



పైపులైన్ పనులను ప్రారంభిస్తున్న రామకృష్ణ

కంటోన్మెంట్: దశల వారీగా తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపుతామని బోర్డు సభ్యుడు రామకృష్ణ అన్నారు. కంటోన్మెంట్ ఐదో వార్డు వాల్మీకి సమాజ్‌లో రూ.8 లక్షల బోర్డు నిధులతో చేపట్టిన తాగునీటి పైపులైన్ పనులకు సోమవారం ఆయన శంకుస్థాపన చేసి మాట్లాడారు. వాల్మీకి సమాజ్‌లో తాగునీటి సమస్యను పూర్తిస్థాయిలో పరిష్కరించి, రాబోయే రోజుల్లో రెండు రోజులకోసారి మంచినీటి సరఫరా అయ్యేలా చూస్తామన్నారు. ఈ కార్యక్రమంలో బస్తీవాసులు సతీష్, బాల్‌రాజ్, కిషన్ కుమార్, మోహన్‌లాల్, ఇంద్రజీత్, ధర్మతేజ్, రన్వీర్, ఈశ్వర్, చమన్ సింగ్, వినోద్, అజయ్, రాజా, అరుణ్ పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల్లో జాప్యం తగదు



పనులు పరిశీలిస్తున్న కార్పొరేటర్ కొంతం దీపిక

రాంగోపాల్‌పేట్: అభివృద్ధి పనుల్లో జాప్యం తగదని మోండా మార్కెట్ కార్పొరేటర్ కొంతం దీపిక సూచించారు. రెజిమెంటల్‌బజార్‌లోని హిల్ స్ట్రీట్ పాఠశాల వద్ద జరుగుతున్న కమ్యూనిటీ హాల్ పనులు, మనోహర్ థియేటర్ వద్ద ప్రారంభమైన వరద నీటి పైప్‌లైన్ పనులను సోమవారం ఆమె పరిశీలించి మాట్లాడారు. వరద నీటి పైప్‌లైన్ పనులు పూర్తయితే మనోహర్ థియేటర్ వెనుక వైపు వర్షం నీరు నిల్వదన్నారు. విద్యా సంస్థలు కొనసాగుతున్న ఈ రోడ్డులో పనుల్లో జాప్యం జరిగితే విద్యార్థులతో పాటు వాహనాలకు ఇబ్బందులు తలెత్తుతాయని, దీంతో పనులను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. కార్పొరేటర్ వెంట ఈఈ సుదర్శన్‌రాజ్, ఏఈ రవీందర్, తదితరులు ఉన్నారు.

క్రైం కార్నర్..

గుండెపోటుతో ఓయూ కాంట్రాక్ట్ ఉద్యోగి మృతి



ఇజ్రాయిల్(ఫైల్)

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ బీ-హాస్టల్ భోజనశాలలో వెయిటర్‌గా పని చేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగి ఇజ్రాయిల్ గుండెపోటుతో మృతి చెందాడు. మాణికేశ్వర్‌నగర్‌లో ఉంటూ 15 సంవత్సరాలుగా ఓయూలో పని చేస్తున్న ఇజ్రాయిల్ మృతి విషయం తెలుసుకున్న ఐఎఫ్‌టీయూ అనుబంధ ప్రోగ్రెసివ్ కాంట్రాక్ట్ అండ్ క్యాజువల్ వర్కర్స్ యూనియన్ నాయకులు, ఐఎఫ్‌టీయూ నగర అధ్యక్షురాలు ఎస్ఎల్ పద్మ నివాళులర్పించి మాట్లాడారు. మృతుని కుటుంబంలోని ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. అంత్యక్రియాలకు అధికారులు అందజేసిన రూ.10 వేలను ఇజ్రాయిల్ కుటుంబ సభ్యులకు అందజేశారు.

బాలుడి అదృశ్యం



ఆనంద్‌యాదవ్

చిలకలగూడ: ఇంట్లో నుంచి బయటకు వెళ్లిన ఓ బాలుడు అదృశ్యమైన ఘటన చిలకలగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్ఐ హరీష్‌గౌడ్ వివరాల ప్రకారం.. సీతాఫల్‌మండి డివిజన్ చిలకలగూడ కిందిబస్తీకి చెందిన ఆనంద్‌యాదవ్ (15) ఈ నెల 3న సాయంత్రం ఇంటి నుంచి బయటకు వెళ్లి రాత్రైనా రాలేదు. అదే ప్రాంతానికి చెందిన స్నేహితుడు హర్మన్ (15)తో కలిసి ఆనంద్ యాదవ్ వెళ్లినట్లు తెలిసిందని, హర్మన్ ఇంటికి వెళ్లి వాకబు చేయగా హర్మన్ కూడా కనిపించడం లేదని తెలిపారని తల్లి ఫిర్యాదులో పేర్కొంది. సీసీ ఫుటేజీలను పరిశీలిస్తున్న పోలీసులు ఎస్ఐ పేర్కొన్నారు.

బేగంపేట పరిధిలో..



ముంతాజ్‌బేగం

సనత్‌నగర్: ఇంట్లో నుంచి బయటకు వెళ్లిన ఓ మహిళ అదృశ్యమైన ఘటన బేగంపేట పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్ఐ సాయికుమార్ వివరాల ప్రకారం..ప్రకాశం జిల్లాకు చెందిన ఆయూబ్‌ఖాన్, ముంతాజ్‌బేగం (45) దంపతులు. బతుకుదెరువు కోసం నగరానికి వచ్చి బేగంపేట వికార్‌నగర్ ప్రాంతంలో ఉంటున్నారు. ముంతాజ్‌బేగం ఈ నెల 7న ఇంటి నుంచి బయటకు వెళ్లి ఎంతకీ రాకపోవడంతో భర్త సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు.

యువతికి వేధింపులు.. కేసు నమోదు

అమీర్‌పేట: పెళ్లి చేసుకుంటానని నమ్మించి మోసం చేయడంతో, వేరే వ్యక్తిని పెళ్లి చేసుకోవాలని నిర్ణయించుకున్న యువతిని బ్లాక్ మెయిల్ చేస్తున్న యువకుడిపై ఎస్ఆర్‌నగర్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఇన్‌స్పెక్టర్ సైదులు వివరాల ప్రకారం.. అమీర్‌పేటకు చెందిన నాగ అభినయ్ అనే వ్యక్తికి మధురానగర్‌లో ఉండే ఓ యువతితో ఏర్పడిన పరిచయం ప్రేమగా మారింది. పెళ్లి చేసుకుంటానని నమ్మించి ఆమెతో ఉండేవాడు. పెళ్లి ప్రస్తావన తేవడంతో నిరాకరించాడు. ఈ క్రమంలో గత నెలలో మరో వ్యక్తితో యువతికి పరిచయం ఏర్పడడం, కుటుంబ సభ్యులు పెళ్లికి అంగీకరించి నిశ్చితార్థం కూడా చేశారు. విషయం తెలుసుకున్న అభినయ్ యువతిని బ్లాక్ మెయిల్ చేస్తూ వస్తున్నాడు. ఇద్దరం కలిసి ఉన్న ఫొటోలను కాబోయే భర్తకు పంపుతానని వేధింపులకు పాల్పడడంతో బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది.

‘రైల్వేస్టేషన్ ఆధునికీకరణ బీఆర్ఎస్‌కు చెంపపెట్టు’



రైల్వేస్టేషన్‌ను సందర్శించిన బండి సంజయ్, లక్ష్మణ్

సికింద్రాబాద్: కేంద్రం తెలంగాణ రాష్ట్రాన్ని చిన్నచూపు చూస్తుందని ఆరోపణలు చేస్తున్న బీఆర్ఎస్ నేతలకు సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ ఆధునికీకరణ చెంపపెట్టుగా మారనుందని బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు డాక్టర్ కే.లక్ష్మణ్ అన్నారు. ఈ నెల 19న సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ నుంచి భారత ప్రధాని నరేంద్రమోదీ వందేభారత్ రైలును ప్రారంభించనున్న నేపథ్యంలో సోమవారం బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్‌తో కలిసి డాక్టర్ లక్ష్మణ్ రైల్వేస్టేషన్‌ను సందర్శించారు. అనంతరం లక్ష్మణ్ మాట్లాడుతూ.. సికింద్రాబాద్ నుంచి వందేభారత్ రైలు ప్రారంభోత్సవంతో పాటు రూ.2,400 కోట్లతో వివిధ రైల్వే అభివృద్ధి పనులను ప్రధాని నరేంద్రమోదీ ప్రారంభించనున్నట్టు తెలిపారు. సికింద్రాబాద్ స్టేషన్ అభివృద్ధి, ప్రయాణికులకు మెరుగైన వసతుల ఏర్పాటు కోసం కేంద్ర ప్రభుత్వం రూ.700 కోట్లను కేటాయించిందని పేర్కొన్నారు. తెలంగాణలో జరుగుతున్న భారీ అభివృద్ధి పనుల్లో కేంద్రం వాటా గణనీయంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మేయర్ బండ కార్తీకచంద్రారెడ్డి, కంటోన్మెంట్ బోర్డు వైస్ ప్రెసిడెంట్ జే.రామకృష్ణ, నాయకులు చింతల రామచంద్రారెడ్డి, శ్యాంసుందర్‌గౌడ్, మేకల సారంగపాణి పాల్గొన్నారు.

ప్రతి యేటా క్రీడా పోటీలు నిర్వహించాలి



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి తలసాని

అమీర్‌పేట: అమీర్‌పేట గురుద్వారా ఆధ్వర్యంలో ప్రతి యేటా క్రీడా పోటీలు నిర్వహించాలని మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ సూచించారు. సద్ సంగత్, ప్రభందక్ కమిటీ గురుద్వారా సాహెబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన బైశాఖీ క్రికెట్ టోర్నమెంట్ ముగింపు వేడుకలకు ఆయన హాజరై మాట్లాడారు. క్రికెట్ పోటీలను పెద్ద ఎత్తున నిర్వహించడం అభినందనీయమన్నారు. కుటుంబ సభ్యులందరూ కలిసి ఒకే చోట చేరి ఆటలు ఆడటంతో గ్రౌండ్‌లో ఆహ్లాదకర వాతావరణం నెలకొందన్నారు. క్రికెట్‌తో పాటు మహిళలకు మ్యూజికల్ చైర్, లెమన్ స్పూన్ వంటి పోటీలు నిర్వహించగా మంత్రి చేతుల మీదుగా బహుమతులు ప్రదానం చేశారు. మంత్రి తరఫున రూ. లక్ష నగదు, రెండు క్రికెట్ కిట్లను అందజేశారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ నామన శేషుకుమారి, గురుద్వారా కమిటీ సభ్యులు సురేందర్‌సింగ్, సుమిత్‌సింగ్ పాల్గొన్నారు.

ఓయూ విద్యార్థి నేతల ముందస్తు అరెస్టులు



దయాకర్‌ను అరెస్ట్ చేసిన పోలీసులు

ఉస్మానియా యూనివర్సిటీ: చలో ప్రగతి భవన ముట్టడి పిలుపు మేరకు ఓయూ విద్యార్థి నేతలను ఆదివారం అర్ధరాత్రి నుంచే అరెస్టులు చేసి పోలీస్ స్టేషన్లకు తరలించారు. యూనివర్సిటీ క్యాంపస్ హాస్టల్స్‌తో పాటు నగరంలోని వివిధ ప్రాంతాలలో నివాసముంటున్న ఓయూ విద్యార్థి నాయకులను అరెస్ట్ చేశారు. తెలంగాణ విద్యార్థి, నిరుద్యోగ ఫ్రంట్ చైర్మన్ చనగాని దయాకర్‌ను డీడీ కాలనీలో అరెస్ట్ చేయగా, భీంరావ్‌నాయక్‌ను వారసిగూడ, ఎస్ఎఫ్ఐ, ఏఐఎస్ఎఫ్, పీడీఎస్‌యూ నాయకులను ఓయూ క్యాంపస్ హాస్టల్స్ నుంచి అరెస్ట్ చేసి సమీప పోలీసు స్టేషన్లకు తరలించారు. ఓయూ విద్యార్థుల అక్రమ అరెస్టులను ఖండిస్తూ సోమవారం ఎస్ఎఫ్ఐ నాయకులు ఆర్ట్స్ కాలేజీ ఎదుట నిరసన తెలిపారు.

ప్రహరీల నిర్మాణాలకు వినతి



వినతిపత్రం ఇస్తున్న నాయకులు

అడ్డగుట్ట: ఈస్ట్‌మారేడుపల్లిలోని పార్కు స్థలాలకు ప్రహరీ నిర్మించాలని బీజేపీ నేతలు సోమవారం సికింద్రాబాద్‌లోని జీహెచ్ఎంసీ కార్యాలయానికి వెళ్లి జోనల్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డిని కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. ఈస్ట్‌మారేడుపల్లి లోని శ్రీ చైతన్య హైస్కూల్, ఫాస్ట్ హై స్కూల్ వెనుకవైపు ఉన్న మున్సిపల్ పార్కు స్థలాలకు ప్రహరీలు నిర్మించి అదే విధంగా పార్కు చుట్టూ నూతన రోడ్డు కూడా వేసే విధంగా చర్యలు తీసుకోవాలని వినతిలో కోరగా జెడ్సీ సానుకూలంగా స్పందించాలరన్నారు. వినతి ఇచ్చిన వారిలో హంసరాజు, విజయ్, ఉదయ్ యాదవ్, రాజశేఖర్, వెంకటస్వామి, లక్ష్మణ్ పాల్గొన్నారు.

ఉత్సాహంగా సీనియర్ సిటిజన్స్ క్రీడా పోటీలు



క్యారమ్స్ ఆడుతున్న మోహన్‌రెడ్డి, డాక్టర్ భార్గవ నారాయణ

సనత్‌నగర్: జీహెచ్ఎంసీ సర్కిల్-17 ఆసరా కమిటీ ఆధ్వర్యంలో వివిధ క్రీడాంశాల్లో సీనియర్ సిటిజన్స్‌కు నిర్వహించిన పోటీలు ఉత్సాహంగా జరిగాయి. మోడల్‌కాలనీలోని సంస్కృతి కమ్యూనిటీ హాల్ పైఅంతస్తులోని సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యాలయం ఆవరణలో సోమవారం జరిగిన ఈ క్రీడా పోటీలకు పలు కాలనీలకు చెందిన సీనియర్ సిటిజన్స్ పాల్గొని ప్రతిభను కనబర్చారు. ఆసరా కమిటీ ఉపాధ్యక్షులు జేఎస్‌టీ శాయి పర్యవేక్షణలో జీహెచ్ఎంసీ ఉప కమిషనర్ మోహన్‌రెడ్డి పోటీలను ప్రారంభించి మాట్లాడారు. సీనియర్ సిటిజన్స్ అనుభవాలు సమాజాభివృద్ధికి ఎంతో అవసరం అన్నారు. ప్రభుత్వపరంగా తాము అవసరమైన సహాయ సహకారాలు అందిస్తామన్నారు. కార్యక్రమంలో యూసీడీ ప్రాజెక్టు అధికారి దామోదర్‌రెడ్డి, ఏఎంఒహెచ్ డాక్టర్ భార్గవ నారాయణ, సీనియర్ సిటిజన్స్ స్టేట్ కౌన్సిల్ సభ్యులు డి. పార్థసారథి, ఆసరా కమిటీ సభ్యులు ఉమామహేశ్వరరావు, జే ప్రసాద్, మాణిక్యరావుపాటిల్, నాగమణి, రాజేశ్వరి, పూర్ణచందర్‌రావు పాల్గొన్నారు. ప్రతిభ కనబర్చిన వారికి బహుమతులు అందజేశారు.

దుప్పట్లు అందజేత

రసూల్‌పురా: ఆశ్రీత రెయిన్‌బో స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో కంటోన్మెంట్ ఉత్తరయ్య హట్స్‌లో ఒంటరి మహిళలు, వితంతువులకు కార్ఖాన ఎస్ఐ జ్ఞానదీప్ చేతుల మీదుగా దుప్పట్లను అందజేశారు. పేదలకు ఆదుకునేందుకు స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావడం అభినందనీయమన్నారు. పేదలు నివసించే హట్స్‌లో సేవా కార్యక్రమాలు చేపడుతున్న వారికి బస్తీ సంఘం అధ్యక్షులు ఉత్తరయ్య కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంస్థ నిర్వాహకులు పర్వతాలు, రంగ నారాయణ స్వామి, మల్లికార్జున్ పాల్గొన్నారు.



చిలకలగూడ: హరిత హారం పేరుతో ప్రభుత్వం కోట్లాది రూపాయలు వెచ్చించి పచ్చదనాన్ని పెంచుతుంటే కొందరు తమ భవన నిర్మాణాలను కొనసాగించేందుకు ప్రభుత్వ స్థలాల్లో ఉన్న చెట్లను నరికేస్తున్నారు. చెట్లను కాపాడాల్సిన అధికారులు నిర్మాణదారులతో కుమ్మక్కై వారికే సహకరిస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. సీతాఫల్‌మండి డివిజన్ శ్రీనివాసనగర్‌లోని బండ మైసమ్మ ఆలయం సమీపంలో ఓ వ్యక్తి తమ ఇంటి ముందున్న ప్రభుత్వ స్థలంలో ఉన్న భారీ వృక్షాన్ని సోమవారం నరికి వేయిస్తుండగా స్థానికులు అడ్డుకునేందుకు యత్నించగా తన వద్ద అన్ని అనుమతులు ఉన్నాయంటూ బుకాయించడంతో సంబంధిత అధికారులకు సమాచారం అందించారు. అటవీశాఖ, జీహెచ్ఎంసీ ఉద్యానవనశాఖ అధికారులు తమ పరిధిలోకి రాదంటూ తప్పించుకునే యత్నం చేయడంతో సదరు నిర్మాణదారునితో అధికారులు కుమ్మకైనట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.